


మనిషి ఇంజనైతే, ఆశ పెట్రోలని ఆ మధ్య నొక వచన కవిత్వం రాసేను. రాస్తున్నప్పుడు ఎంతో ఆశ పెట్టుకుని రాసేను. ఇది జనంలోకి బాగా వెళ్ళిపోయి నాకు మంచిపేరు వస్తుందని ఎంతో ఆశించేను. ఆ కవిత్వం, దాని వరసా నా వరకూ బాగానే వుంది. అది విన్నవాళ్ళు మాత్రం నోళ్ళు చప్పరించేసేరు. మనిషి ఇంజనన్నావ్ బాగానే వుంది. అది ఏ ఇంజనో చెప్పాలన్నారు. పెట్రోల్లేకపోతే డీసెల్ ఆయిలుందిగదాని అడ్డమొచ్చారు. నాకు గొప్ప కోపం వచ్చేసింది. అన్నీ విడమరిచి చెబితే నేనేం కవినింక, నా పిండా కూడు? అక్షరం చదవగానే అర్థం చేసుకునే చురుకు మెదళ్లు దేశంలో కరువై పోతున్నాయి. కవుల కివి రోజులు కావు.

అయితే....జనం నోళ్ళు చప్పరించినంత మాత్రాన నేను నా కవితా వ్యాసంగానికి చుక్క పెట్టుకొనే తెలివి తక్కువవాడ్ని కాను. ఇంజనూ, పెట్రోలని కవిత్వం రాసేను గనక ఆశకి కట్టుబడి వుంటాను. ఇవాళ కాకపోతే రేపు, రేపు కాకపోతే ఇంకో రోజు. ఏదో ఒక రోజున నా కవిత్వం పండుతుంది. జనాన్ని ఆకర్షిస్తుంది. ఓహో ఆహా అనిపిస్తుంది. కనుక మనిషికి ఆశ ఎంత అవసరమో యిప్పటికైనా మీరు గమనించే వుంటారు.

ఆ మాటకొస్తే ఆశ అనేది పని జెయ్యకపోతే మనిషి అర నిమిషం బతకలేడు. దెబ్బలు తగుల్తూనే వుంటాయి. కొత్త ఆశలు, చిగురులు తొడుగుతూనే ఉంటాయి. ఇదొక ఆట. ఇదిట్లా ఆడుకుంటూ పోవల్సిందే. చదువుకునే కుర్రాడు పరీక్ష పాసవుతాననే ఆశతోనే చదువుతాడు. అతనెంత దద్దమ్మ అయినా ఆశ పడుతూనే వుంటాడు. పరీక్షా ఫలితాలొచ్చేంత వరకూ ఆశ అతన్ని బతికిస్తుంది. ఫలితాలు ప్రకటించిన తర్వాతనే రైలు పట్టాలు వెతుక్కుంటాడు. అందుచేతనే ఫలితాలు ప్రకటించినే ఫలితాలు ప్రకటించిన రోజుల్లోనే దుర్మరణాలు చూస్తుంటాం. అంతేగాని పరీక్షలు జరిగే రోజుల్లో ఎవడూ తొందరపడడు. అతను పేపరు చెడగొట్టినా, ఆశ పీడిస్తుంది. మోడరేషనో మరొకటో అతన్ని ఆదుకుంటుందని ఆశ కలుగుతుంది. పేపరులో తప్పినట్టు సమాచారం అందినా, కొందరు నిబ్బరంగా వుంటున్నారంటే రెండే రెండు కారణాలు. సెకండు లిస్టు వస్తుందని, సెప్టెంబరులో పాసవ్వొచ్చనీను.

ఎన్నికలు కూడా ఇదే తంతు. లక్షలకు లక్షలు గుప్పించేసి అభ్యర్థులుగా నిలబడు తున్నారంటే ఏమిటర్థం? ఆశ! తాను తప్పకుండా గెలుస్తాననే ధీమా! నలుగురు నిలబడితే గెలిచేది ఒక్కడేనని ఆ నలుగురుకీ తెలుసు. ఆ ఒక్కడు తానేనని ఆ నలుగురూ ఆశ పడటం సహజం. ఆ ఆశే లేకపోతే లక్ష లెందుకు హారతి కర్పూరం చేసుకుంటారు. డిపాజిట్టు దక్కని అభ్యర్థి సైతం కొండంత ఆశ పెట్టుకుంటాడు. కాదంటే ఎట్లా? ఎన్నికల్లో నెగ్గిన అభ్యర్థి మంత్రి నవుతానని ఆశ పెట్టుకుంటాడు. మంత్రి కాకపోతే కనీసం డిప్యూటీ రేంకైనా తగులుతుందని ఆశిస్తాడు. ఆ అయిదేళ్ళూ ఆ ఆశతోనే అధినాయకులకు వినయంగా వుంటాడు. ఆపాటి ఆశ లేకపోతే

పార్టీ మార్చేస్తాడు. అక్కడచేరి ఇంకో కొత్త ఆశ పెట్టుకుని కాలం గడుపుతాడు. ఈ కాలం గడపడమనే ప్రక్రియ ఆశ ఆధీనంతోనే జరుగుతుందని మనం అనుకోవాలి.

మన పర్సు కొట్టేసే మనిషికి పర్సు మీద బోల్డంత ఆశ పెట్టుకుంటాడు. అందులో అడ్రసు కాగితాలుతప్ప మరేమీ లేవని చెబుతే, అతను మన జేబు ప్రాంతాలకే రాడు. అతని వృత్తికి పెట్టుబడి ఆశ. అడగ్గానే అప్పు యిచ్చేమంటే మన డబ్బు మనకి సకాలంలో చేరుతుందనే ఆశ పని చేసిందనే చెప్పాలి. అంతేకాని దానం చేసేటంత చొరవ మనకేల ?

ఆశంటూ లేకపోతే—

ప్రపంచ వ్యాపారమే స్థంభిస్తుంది. కోర్టులు మూత పడతాయి. లాయర్లు బోర్డులు తిప్పేసు కుంటారు. డాక్టర్లు మందు లివ్వరు. రోగులు డాక్టర్ల మొహం చూడరు. విద్యార్థులు పుస్తకాలు చదవరు. చదివినా పరీక్షలకు వెళ్ళరు. లాటరీలు సవ్యంగా నడవవు. ఇరవై లక్షలన్నా పట్టించుకోరు. రేసులు మూల పడతాయి, రేసు గుర్రాలు జట్కా బళ్ళని లాగుతాయి. ఎవడూ నవ్వడనే అభిప్రాయంతో ఎవ్వడూ జోకు లేయడు. ఎన్నిక లాగిపోతాయి. ప్రజాసేవ కుంటుపడుతుంది. ఉద్యమాలు, పెద్ద పెద్ద ఆందోళనలు యిక చాల్లే అంటూ చతికిల పడతాయి.

ఇంత ఆలోచించి, నేను ఆశ పేరిట కవిత్వం రాస్తే, కాదు పొమ్మన్నారు. ఆశని పెంచుకో తమ్ముడూ అని చివర్లో చెప్పిన దానికి జనం సగమ్మంది లేచి వెళ్ళిపోయేరు. అయితే, అట్లా లేచిపోయిన వాళ్ళంతా ఆశావాదులు కారని గ్యారంటీ ఇవ్వలేను. వాళ్ళమూల్యమైన కాలాన్ని నా బోడి కవిత్వానికి అంకితంచేసి పాడు చేసుకునే దానికంటే, మరో వ్యాపారం వెదుక్కోవడం బెటరనే ఆశలో లేచి వెళ్ళిపోయేరని నేననుకుంటున్నాను.